సాక్షి
అనకాపల్లి
శనివారం । 8 । జూన్ । 2024



వైభవంగా ఆర్జిత సేవలు
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. 8లో



కొత్త ప్రపంచం.. బంగారు జీవితం
కౌమార దశ ఎంతో కీలకమైనది. గాడి తప్పితే జీవితమే గందరగోళమవుతుంది. క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం 8లో

గరిష్టం/కనిష్టం
34.8/25.5

వాతావరణం
ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

మంత్రులుగా
అనిత, పల్లాకు చాన్స్!

- జనసేన నుంచి కొణతాలకు అవకాశం !
- గంటా, అయ్యన్నలకు మొండిచేయి
- ఇప్పటికే సంకేతాలు పంపిన చంద్రబాబు
- పదవి కోసం పైరవీలు ప్రారంభించిన మరికొందరు





సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉమ్మడి విశాఖ జిల్లాలో అమాత్య యోగం సీనియర్లకు దక్కే సూచనలు కనిపించడం లేదు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంలో తమకు మంత్రి పదవి దక్కుతుందనే ఆశతో ఎదురు చూస్తున్న సీనియర్లకు నిరాశే ఎదురుకానున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా ఎస్సీ, బీసీ కోటాలో ఇద్దరికి అవకాశం కల్పించాలని టీడీపీ అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చింది. ఎస్సీ కోటాలో పాయకరావు పేట నియోజకవర్గం నుంచి గెలుపొందిన అనితతో పాటు గాజువాక నియోజక వర్గం నుంచి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావులకు బీసీ (యాదవ) కోటాలో మంత్రి హోదా దక్కనున్నట్టు తెలుగుదేశం పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే వీరిద్దరికీ కూడా సమాచారం అందినట్టు ఈ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, అయ్యన్న మాత్రం పట్టువదలకుండా తనకు మంత్రి పదవి కావాల్సిందేనని ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మొత్తంగా మంత్రి పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో భారీగా పోటీ నెలకొంది. ఇక జనసేన తరఫున అనకాపల్లి నుంచి గెలుపొందిన కొణతాల రామకృష్ణ పోటీలో ప్రాధాన్యత క్రమంలో ముందు వరుసలో ఉన్నారు. ఇక బీజేపీ నుంచి విష్ణుకుమార్ రాజు ఆశిస్తున్నారు. అయితే ఆయనకు కష్టమేనని తెలుస్తోంది.

సీనియర్లను పక్కన పెట్టి...
మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారీగా సీట్లను సాధించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ నుంచి మినహా మిగిలిన పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించింది. దీంతో మంత్రి పదవుల కోసం భారీగా పోటీ నెలకొని ఉంది. అయితే ఈ సారి మంత్రి వర్గంలో తన మార్క్ స్పష్టంగా కనిపించేందుకు వీలుగా పూర్తిస్థాయిలో సీనియర్లను పక్కన పెట్టే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే సీనియర్లుగా ఉన్న గంటా శ్రీనివాసరావు, అయ్యన్న, బండారులను పరిగణనలోనికి తీసుకునే అవకాశం లేదని సమాచారం. ఇందులో బండారు, గంటాలకు సీటు కేటాయించే సమయంలోనే మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదని పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు అయ్యన్నకు మాత్రం కచ్చితంగా మంత్రి పదవి ఇస్తారనే ప్రచారం పార్టీలో జరుగుతోంది. అయితే సీనియర్లను పక్కన పెట్టే ఉద్దేశంతో శ్రీకాకుళంలో కూడా అచ్చెన్నాయుడుకు ఇవ్వడం లేదని సమాచారం. ఇదే కోవలో ఇక్కడ కూడా అయ్యన్న పాత్రుడిని పరిగణనలోనికి తీసుకోవడం లేదని పార్టీలో అంతర్గతంగా ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో కాకుండా మరో విధంగా గౌరవం కల్పిస్తానని అయ్యన్నను బుజ్జగించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా సీనియర్లను పక్కన పెట్టి తన మార్క్ పూర్తిస్థాయిలో ఉండే విధంగా చంద్రబాబు వ్యవహరించనున్నట్టు మాత్రం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

జనసేనలోనూ పోటా పోటీ...

జనసేన నుంచి కూడా మంత్రి పదవుల కోసం పోటీ నెలకొని ఉంది. ప్రధానంగా ఎమ్మెల్యేలుగా గెలిచిన కొణతాలతో పాటు పంచకర్ల, సుందరపు విజయ్‌కుమార్, వంశీకృష్ణలు కూడా మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఇప్పటికే యాదవ సామాజికవర్గం నుంచి పల్లాకు బెర్తు ఉండటంతో వంశీకృష్ణకు ఇచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. మరోవైపు మొదటిసారిగా గెలిచిన సుందరపు విజయ్‌కుమార్‌కు కూడా కష్టమేనని సమాచారం. ప్రధానంగా కొణతాలతో పాటు పంచకర్ల రమేష్‌బాబుల మధ్య పోటీ ఉంది. అయితే గవర సామాజికవర్గానికి చెందిన కొణతాల వైపే పవన్ మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. కాపు కోటాలో పంచకర్ల కూడా గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు ఎవరికి యోగం వరించనుందో మరో రెండు, మూడు రోజుల్లో తేలనుంది. మొత్తంగా అధికారపక్షంలో అమాత్యుల కోసం భారీగా పోటీ నెలకొని... ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమై ఉన్నారు.

13న ఉక్కు కార్మికులకు
జీతాల చెల్లింపు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు 13న జీతాల చెల్లించనున్నారు. కార్మిక సంఘాలకు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ తెలిపారని కార్మిక నాయకులు చెప్పారు. శుక్రవారం ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన సమావేశంలో నాయకులు జీతాల చెల్లింపు గురించి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతల్లో కీలక పాత్ర వహిస్తున్న ఉద్యోగుల జీతాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యవైఖరి కూడదన్నారు. జీఎస్టీ, విద్యుత్ బిల్లులు, ముడి పదార్థాల చెల్లింపునకు ఇచ్చే ప్రాధాన్యత జీతాల చెల్లింపునకు ఇవ్వరా అని ప్రశ్నించారు. ఈనెల కార్మికులు తమ పిల్లలకు ఫీజులు కట్టాల్సి ఉన్నందున 10 నాటికి జీతాలు చెల్లించాలని కోరారు. దీనిపై సీఎండీ మాట్లాడుతూ మిగతా చెల్లింపులు ఉన్నందున 13న జీతాలు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు శ్రామిక సంఘం ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ నాలుగు నెలలుగా నిర్వాసిత కార్మికులకు జీతాలు అందడం లేదని సీఎండీ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, సీరుకొండ రామచంద్రరావు, వై.టి. దాస్, బొడ్డు పైడిరాజు, సన్యాసిరావు, నరేంద్ర, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సకాలంలో పుస్తకాల పంపిణీకి చర్యలు



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కశింకోట: కశింకోట బాలికల హైస్కూలుకు చేరిన విద్యాకానుకలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను తనిఖీ చేశారు. ఈనెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని, విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు పుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మూర్తి, సీఆర్పీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.1,58,712 విరాళం



పెనుగంచిప్రోలు (ఎన్టీఆర్ జిల్లా): గ్రామంలోని శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన యలవర్తి శ్రీనివాసరావు కుటుంబసభ్యులు రూ.1,58,712 విరాళాన్ని ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

గాం గంటం దొరకు నివాళి



గాం గంటం దొర చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గిరిజన భవన్ ఉద్యోగులు

కొమ్మాది (విశాఖ): రుషికొండ బీచ్‌రోడ్డులో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ భవన్‌లో గిరిజన సమరయోధుడు గాం గంటం దొర శత వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గంటం దొరకు భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం గంటం దొర పోరాటాలు చేశారని అన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలోనూ గంటం దొర కీలక పాత్ర పోషించారన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది (విశాఖ): రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా మంగళవాయిద్యాల నడుమ శ్రీవారిని శేషవస్త్రం, అభిషేక సామగ్రితో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యంతో పలు స్టేషన్ల నుంచి బయలుదేరాల్సిన రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ (12829) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు, చెన్నై ఎగ్మోర్-సంబల్‌పూర్ (06109) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు, ఎస్ఎంవీటీ బెంగళూరు- హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు, లోకమాన్య తిలక్ టెర్మినస్-భువనేశ్వర్ (08419) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 6 గంటలు ఆలస్యంగా రాత్రి 7.30 గంటలకు బయలుదేరింది.

వైద్యాధికారి పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఓఎస్ థెరపీ కేంద్రంలో కాంట్రాక్టు విధానంలో వైద్యాధికారి పోస్టు భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీలోగా తమ దరకాస్తులను ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటిండెంట్ కార్యాలయంలో అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్ (విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన..
కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

శ్రీవిద్య కోర్సు ప్రారంభం



దేవీపురంలో నేర్చుకొనేందుకు వచ్చిన విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీ దేవి పీఠంలో శ్రీవిద్య కోర్సును శుక్రవారం ప్రారంభించారు. తెలుగు భాషలో ఈ నెల 7వ తేదీ నుంచి 10 తేదీ వరకూ నాలుగు రోజుల పాటు ఈ కోర్సు నేర్పించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. విద్యార్థులకు ముందుగా శ్రీగురు పాదుకా మంత్రోపదేశం చేసి శ్రీగణపతి,బాల,చండీ మంత్రోపదేశాలు చేశారు. ప్రాథమిక అంశాలైన మంత్ర సాధన,యంత్ర పూజలు,తర్పణాల తయరీతో పాటు ఆచరణాత్మకంగా నేర్చుకొంటారన్నారు.

ఏలేరు కాలువకు లీకేజీ



మండలంలో ఏలేరు కాలువ (ఇన్‌సెట్) చినగొలుగొండపేట వద్ద డ్రైనేజీలో చేరుతున్న లీకేజీ నీరు

- వృథాగా నీరు పోవడంతో స్టీల్‌ప్లాంటుకు తగ్గిన సరఫరా

నాతవరం: కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి విశాఖ స్టీల్‌ప్లాంటుకు తరలిస్తున్న కాలువ నీరు లీకేజీలతో వృథాగా పోతోంది. నాతవరం మండలం పెదగొలుగొండపేట సమీపంలో 66 కిలోమీటరు వద్ద నిత్యం నీరు వృథాగా పోతున్నా, అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. 1989లో ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో 154 కిలోమీటర్ల మేర ఏలేరు కాలువ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా నాతవరం మండలం పి.జగ్గంపేట, కె.ధర్మవరం, పి.కె.గూడెం, గునుపూడి, పెదగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం, లింగంపేట, మన్యపురట్ల, ఉప్పరగూడెం, ఎ.పి.పురం, ఎం.బి.పట్నం, ఎ.శరభవరం, లక్ష్మీపురం, వెంకయ్యపాలెం, జిల్లేడుపూడి, చెర్లోపాలెం గ్రామాల మీదుగా 26 కిలోమీటర్ల మేర ఏలేరు కాలువ నీరు ప్రవహిస్తోంది. ఇందులో గునుపూడి, చినగొలుగొండపేట, ఉప్పరగూడెం, మన్యపురట్ల, ఎ.శరభవరం ప్రాంతాల్లో ఏలేరు కాలువ పలు చోట్ల లీకేజీకి గురై నీరు పోతోంది. ఈ విధంగా పోవడం వల్ల విశాఖ స్టీల్ ప్లాంటుకు సరఫరా అవుతున్న నీరు గణనీయంగా తగ్గుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంటుతోపాటు ఇతర పరిశ్రమలు, విశాఖ నగర ప్రజలకు తాగునీటి కోసం ఏలేరు కాలువ ద్వారా రోజు ఒక్కంటి 150పైగా క్యూసెక్కులు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో తుపాన్లు సంభవించినప్పుడు భారీ వర్షాలకు ఏలేరు కాలువ పలు చోట్ల దెబ్బతింటోంది. ఆ సమయంలో అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. కాలువను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయక పోవడం వల్ల అనేక చోట్ల మరమ్మతులకు గురై లీకేజీ అవుతోంది. ఇప్పటికైనా కాలువకు సిమెంటు లైనింగ్ చేస్తే లీకేజీ సమస్య తప్పుతుందని స్థానికులు కోరుతున్నారు.

జూలో పిల్లల కోలాహలం



పక్షుల జోన్‌లో రామ చిలుకలను చూస్తున్న పిల్లలు



జూలో ఏర్పాటు చేసిన ఆట పరికరాల వద్ద చిన్నారుల సందడి

ఆరిలోవ (విశాఖ): ఇందిరా గాంధీ జూ పార్కులో శుక్రవారం పిల్లల సందడి నెలకొంది. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో కొద్ది రోజులుగా జూ పార్కుకు సందర్శకుల తాకిడి ఎక్కువైంది. ఇక్కడ పక్షులు, ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు, కోతులు, మొసళ్లు, పాముల ఎన్‌క్లోజర్ల వద్ద పిల్లల సరదాగా గడిపారు. జూలో క్యాంటీన్ పక్కన, కనుజుల ఎన్‌క్లోజరు ఎదురుగా ఏర్పాటు చేసిన ఆట పరికరాల వద్ద పిల్లలు ఆడుకుంటూ సందడి చేశారు. తల్లిదండ్రుల సహకారంతో ఊయలలు, తోపుడు బల్లలు, జారుడు బల్లలు, తదితర ఆట పరికరాలు ఎక్కి ఎంజాయ్ చేశారు.

ఖరీఫ్ సాగు సందడి

- నారుమడుల తయారీలో రైతన్నల నిమగ్నం
- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- గతేడాది కంటే పెరగనున్న సాగు విస్తీర్ణం
- జిల్లాలో 23 వేల క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు
- ఇప్పటికే ఆర్బీకేలకు చేరిన 5 వేల క్వింటాళ్లు
- నెలాఖరులోగా వరి విత్తనాల పంపిణీ

తొలకరి వర్షాలు పలకరించి.. పుడమి పులకరించడంతో అన్నదాతలు మురిసిపోతున్నారు. ప్రభుత్వం సైతం విత్తనాలు అందుబాటులో ఉంచడంతో రెట్టించిన ఉత్సాహంతో ఖరీఫ్ సాగుకు ఉపక్రమించారు. ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తిచేసి వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. గతేడాది పెరిగిన దిగుబడితోపాటు మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగనుందని అంచనా.




రైవాడ రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలు



దేవరాపల్లిలో సిద్ధం చేసిన వరి నారుమడి

దేవరాపల్లి/చోడవరం: గ్రామాలన్నీ వ్యవసాయ పనులతో సందడిగా మారాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో నారుమడులు సిద్ధం చేసే పనిలో రైతులు బిజీ అయ్యారు. చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల పరిధిలో చెరకు, సరుగుడు సాగుచేసే భూముల్లో సైతం ఈ ఏడాది వరి సాగు చేసేందుకు సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు
అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలను 2.15 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిలో లక్షా 40 వేల ఎకరాలలో వరి సాగవుతుందని ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం జిల్లాలో 23 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు 5 వేల క్వింటాళ్లను తరలించారు. మిగిలిన విత్తనాలను సైతం వారం పది రోజుల్లో ఆర్బీకేలకు తరలించించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఆర్బీకేలకు అందుబాటులోకి వచ్చిన విత్తనాలను మొలకశాతం కట్టి నాణ్యతను పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకునే రైతులకు ఈ నెలాఖరులోగా పంపిణీ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు వ్యవసాయ బోర్లు, జలాశయాల ఆయుకట్టు భూముల్లో కొంతమంది రైతులు సొంత విత్తనాలను ఇప్పటికే నారుమడుల్లో జల్లుతున్నారు. అంతేకాకుండా సాధారణ రకాల వైపు వెళ్లకుండా బీపీ రకాలైన సోనామసూరి, ఆర్‌జీఎల్ రకాలకే రైతులు ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చారు. రెండేళ్లుగా జిల్లాలో ఖరీఫ్ వరి పంట చాలా మంచి దిగుబడి రావడంతో రైతులు నుంచి ధాన్యాన్ని ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల ద్వారా మిల్లర్లను గ్రామాలకు రప్పించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అమ్మిన ధాన్యానికి సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో ప్రస్తుతం వరి సాగుపై ఆసక్తి మరింత పెరిగింది.



నీటితో కళకళలాడుతున్న రైవాడ జలాశయం

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు
భూసారాన్ని పెంపొందించే పచ్చిరొట్ట ఎరువులను సైతం జిల్లా వ్యాప్తంగా 1,050 క్వింటాళ్లు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచారు. రాయితీపై అందిస్తున్న జీలుగు, పిల్లి పెసర, జనుము తదితర పచ్చి రొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 35 వేల టన్నులు ఎరువులు అవసరమని అంచనా వేశారు. దమ్ములు ప్రారంభమయ్యే నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని చెబుతున్నారు.

కళకళలాడుతున్న రైవాడ జలాశయం
రైవాడ జలాశయంలో నీటి నిల్వలతో కళకళలాడుతోంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 104.70 మీటర్ల వద్ద నిలకడగా ఉంది. జలాశయం పరిధిలో 15,353 ఎకరాల ఆయకట్టు ఉంది. జలాశయంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీటిమట్టం మరింత పెరిగే అవకాశముందని ఇరిగేషన్, అంచనా వేస్తున్నారు. ఆయకట్టు సాగు నీటికి ఎటువంటి ఢోకా ఉండబోదని చెబుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మరింత ఉత్సాహంతో సాగు పనులు చేపడుతున్నారు.

గతంలో మాదిరిగా విత్తనాలు పంపిణీ చేయాలి



ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాం. గతేడాది మాదిరిగా ఈ ఏడాది మంచి దిగుబడి రావాలని ఆశిస్తున్నాం. పొలాల్లో వేసవి దుక్కులు సైతం పూర్తి చేశాం. నారుమడులను సిద్ధం చేసుకుంటున్నాం. గతంలో మాదిరిగా ఇబ్బంది లేకుండా విత్తనాలు పంపిణీ చేయాలి.

– గొర్లి సన్నిబాబు, రైతు, దేవరాపల్లి

విత్తనాలు కావల్సిన మేరకు సరఫరా



జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. గ్రామాల్లో వరి వేసేందుకు రైతులు చాలా ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది సొంత విత్తనాలు సిద్ధం చేసుకోగా, మిగిలిన వారు ఆర్బీకేల్లో విత్తనాల కోసం నమోదు చేసుకోవాలి. చెరకు, సరుగుడుకు ప్రత్యామ్నాయంగా వరిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు కావలసిన మేరకు సరఫరా చేస్తాం.

– బి.మోహనరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, అనకాపల్లి

కొత్త ప్రపంచం.. బంగారు జీవితం

కలలు.. ఆశలు.. ఆనందాలు.. హర్షయ్యే సందర్భాలు.. పాఠాలు.. దుమ్మాలు.. అన్నీ కొత్తగా అనిపించేవే. అప్పటి వరకు పాఠశాల చదువు.. ఒక్కసారిగా కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. ఈ క్రమంతో కొత్త పరిసరాలు.. కొత్త వారితో పరిచయాలు, సరికొత్త ఆలోచనలు.. ఇప్పుడిప్పుడే కళాశాలలో అడుగుపెట్టే విద్యార్థికి ఇలా అన్నీ కొత్తగా.. వింతగా అనిపిస్తాయి. టీనేజ్‌లో ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకం. అంతే కాదు జీవితాన్ని మలుపు తిప్పాలన్నా ఇదే ముఖ్యమైన కాలం. అన్నీ తెలిసినట్టే అనిపిస్తుంది. కానీ ఏమీ తెలియని తనం ఆవహిస్తుంది. ఈ రెండింటి మధ్య తేడాను తెలుసుకుంటే జీవితం విజయం వైపు పయనిస్తుంది. కొత్త బంగారులోకం అవుతుంది. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా.. జీవితం మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నడుస్తుంది.

– విశాఖ విద్య

- ఇంటర్‌లో కౌమార దశ
- గాడి తప్పితే జీవితమే గందరగోళం
- చెడు వ్యసనాలను దరిచేరనీయకూడదు
- క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం

తొలిసారి ఎదుర్కొన్న పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించామన్న ఆత్మ విశ్వాసం, పాఠశాలను దాటి కళాశాలను చేరామన్న ఉత్సాహం..కొత్త పరిచయాలు, కళాశాల వాతావరణం కలిగించే ఆనందం వెరసి విద్యార్థులకు కళాశాల దశ కొత్త అనుభూతిని అందిస్తుంది. అనువైన గ్రూపు.. ఇష్టమైన సబ్జెక్టులు చదివే తొలి స్వేచ్ఛా దశ ఇదని చెప్పవచ్చు. జీవితంలో కీలక అడుగులన్నీ ఇంటర్‌లోనే పడతాయనడంలో అతిశయోక్తి లేదు. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధించినా.. గాడి తప్పి అధఃపాతాళానికి పడిపోయినా ఇక్కడే బీజాలు పడతాయి. హైస్కూల్ విద్యతో మొదలయ్యే కౌమార ప్రాయం ఇంటర్‌లో మరింత పురివిప్పుతుంది. అందుకే ఈ దశ చాలా కీలకం.

స్నేహమెంత మధురం

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ అది ఉన్నత భావాలున్న వారితో కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది. పశ్చాత్తాపం పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజం మీద అవగాహన, అధ్యాపకులపై సదాభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంలోనే ముందుకు సాగాలి.



విశాఖలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్(ఫైల్)

చదువుకే తొలి ప్రాధాన్యం

ఇంటర్ విద్యార్థులు ఎన్నో అంశాలకు ఆకర్షితులవుతారు. ఈ దశలో అందరికీ తొలి ప్రాధాన్యం చదువే కావాలి. జీవితం అల్లరి పాలయ్యేలా అల్లరి ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలకు డుమ్మా కొట్టడం, హీరోయిజం కాదనే విషయాన్ని తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరవడం, పాఠ్యాంశాలపై దృష్టి పెట్టడం, అధ్యాపకులిచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు నీట్‌గా రాసుకోవడం, పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవడం, స్నేహితులతో కలిసి కంబైన్డ్ స్టడీ చేయడం వంటివి ఉపయుక్తంగా నిలుస్తాయి.

సమయం విలువైనది

ఇంటర్‌లో సెలవు దినాలంటే విద్యార్థులకు పండగే. అయితే వాటిని సద్వినియోగం చేసుకోగలిగితే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలడు. ఆయా సమయాల్లో వారు ఎంచుకునే వ్యాపకాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయి. మనసును, శరీరాన్ని ఉల్లాసపరచే మంచి క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, శ్రుతిమించని వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి. సివిల్స్, ఇంజినీరింగ్, మెడిసిన్, సాఫ్ట్‌వేర్ వంటి ఏ కోర్సుకైనా నా తొలి అడుగు పడాల్సింది ఇంటర్‌లోనే.

వ్యసనాలకు దూరం

జీవితాన్ని ప్రభావితం చేసే ప్రమాదకరమైన వ్యసనాలు ఈ దశలోనే అలవాటయ్యే అవకాశాలు ఉన్నాయి. వాటి నుంచి తప్పించుకోవాలి. సిగరెట్, గుట్కాలు, మద్యం వంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. ముఖ్యంగా సెల్‌ఫోన్ విద్యార్థుల ప్రగతికి అవరోధంగా మారుతుంది. తరగతి గదుల్లో.. చదువుకునే వేళల్లో అనవసరమైన కబుర్లకు అలవాటు పడేలా చేస్తాయి. పరిచిత, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ మోజులో పడొద్దు. నెట్ అలవాటు విషయంలోను విద్యార్థులకు జాగ్రత్త అవసరం. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు ప్రేరేపించే అవకాశం ఉంటుంది. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావంతో, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణమంటూ మనసు కలుషితం చేసుకోవద్దు. దారి తప్పి భావి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్నేహితులే లోకంగా అనిపించే వయసులో వారికి అతి ప్రాధాన్యం ఇస్తూ తల్లిదండ్రుల, అధ్యాపకులను నిర్లక్ష్యం చేయకూడదు. తల్లిదండ్రులు ఇచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దు.

కాలేజీల్లో కమిటీల ఏర్పాటు



విద్యా సంవత్సరం ప్రారంభమైనందున అకడమిక్ క్యాలెండర్ మేరకు తరగతులు నిర్వహించాలని కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలిచ్చాం. బాలబాలికల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపి వారు చదువులపైనే శ్రద్ధ చూపేలా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాం. ఇంటర్మీడియట్ ప్రాధాన్యం దృష్ట్యా విద్యార్థులు సత్ప్రవర్తనతో చదువులపైనే దృష్టి పెట్టి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి.

– పి.మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి



పదో తరగతి చదివి ఇంటర్‌లోకి రాగానే ఏదో లోకంలో విహరిస్తారు. విద్యార్థుల్లో ఇది ఎంతమాత్రం సరైంది కాదు. ఇంటర్మీడియట్‌లో బాగా చదువుకుంటే ఉన్నత చదువుల్లో నచ్చిన రంగం వైపు పయనించవచ్చు. షికార్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. కాలేజీలకు వెళ్లిన తమ పిల్లల చదువులు ఎలా ఉన్నాయనేది తల్లిదండ్రులు కూడా పర్యవేక్షణ చేయాలి. మా విద్యా సంస్థల్లో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కౌన్సిలర్లను ఏర్పాటు చేశాం.

– కె.వి.రమణ, శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం, విశాఖ

చదువుకుంటేనే భవిష్యత్



విద్యార్థులు బాగా చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుంది. ఇదే విషయాన్ని మా విద్యార్థులకు చెబుతున్నాం. కాలేజీ అంటే అదో లోకం అనే ధోరణి వీడాలి. విద్యార్థులు చదువులపైనే శ్రద్ధ వహించాలి. ఈ విషయంలో విద్యార్థులకు మా వంతుగా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచిస్తున్నాం. చదువు విలువ తెలుసుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తున్నాం.

– బి.స్వాతి, కౌన్సిలర్, కేజీబీవీ, ఆనందపురం

కలలను సాకారం చేసుకోవాలి



ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకం. దీనిపై శ్రద్ధ వహించే వారు తమ కలలను సునాయాసంగా సాకారం చేసుకోవచ్చు. చదువుతో ఏదైనా సాధ్యమే. కాలేజీలకు వచ్చేశామని మితిమీరిన స్వేచ్ఛ వద్దు. కాలేజీల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, నేరుగా అధ్యాపకులతో చెప్పుకోవచ్చు. విద్యార్థులకు అండగా నిలిచేలా ప్రభుత్వ కాలేజీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.

– బి.రాధ, డీవీఈవో, విశాఖ

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

- ఆర్బీకేల ద్వారా సరఫరాకు ఏర్పాట్లు
- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

తుమ్మపాల: జిల్లాలో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 24 మండలాల్లో రైతులకు అందించేందుకు వీలుగా 373 క్వింటాళ్ల జనుము, 559 క్వింటాళ్ల జీలుగ, 124 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తామన్నారు. జనుము, జీలుగ కిలో రూ.44, పిల్లిపెసర కిలో రూ.67లకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భూమి ఆరోగ్యంగా ఉండటానికి, నేల నాణ్యత పరిరక్షించుకునేందుకు పచ్చిరొట్ట ద్వారా లభించే సేంద్రీయ పదార్థం ఎంతో ఉపయోగమన్నారు. పచ్చిరొట్ట పైరును నేలలో కలియదున్నడం వల్ల భూమి భౌతిక స్థితి మెరుగై, నేలలో పంటకు ఉపయోగకరమైన సూక్ష్మజీవుల వృద్ధికి దోహదపడుతుందన్నారు. పచ్చిరొట్ట పైరును వరి పంటకు ముందు మే, జూన్ నెలల్లో విత్తుకుని అవి పూతదశకు వచ్చే సమయంలో తొలకరి వర్షాలకు భూమిలో కలియదున్నాలని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలను విత్తే ముందు 24 గంటల పాటు నీటిలో నానబెట్టాలని సూచించారు. జనుము ఎకరాకు 20–25 కిలోలు, జీలుగ 12–15 కిలోలు, పిల్లిపెసర 6 కిలోలు విత్తుకుంటే సరిపోతుందన్నారు.

పచ్చిరొట్ట ప్రయోజనాలు

జనుము: ఎకరానికి 6 టన్నుల వరకు పచ్చిరొట్ట ఎరువును ఇస్తుంది. 40 కిలోల నత్రజని, 6 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం నేలకు లభిస్తుంది.

జీలుగ: ఎకరానికి 8 టన్నుల వరకు పచ్చిరొట్ట ఎరువునిస్తుంది. 30 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం లభిస్తుంది. నిస్సారమైన, చవుడు నేలల్లో ఇది బాగా పనిచేస్తుంది.

పిల్లిపెసర: ఎకరానికి 4 టన్నుల వరకు వచ్చే పచ్చిరొట్ట ఎరువుతో 18 కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరం, 13 కిలోల పొటాషియం లభిస్తుంది. దీంతో నీటి నిల్వలు, నీటి ఎద్దడిని కూడా తట్టుకుని పంటలు ఏపుగా ఎదుగుతాయి.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

10న జాబ్ మేళా

రాంబిల్లి: ఈ నెల 10న హరిపురం బీసీటీ ఐటీఐ క్యాంపస్ వద్ద జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బీసీటీ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెజ్‌లోని టీజే సంస్థలో ఖాళీల భర్తీకి ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్కులై, టెన్త్ పాస్/ఫెయిల్ అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని వెల్లడించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



గొల్లవిల్లి కేశవ

మునగపాక: స్థానిక ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న గొల్లవిల్లి కేశవ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. వివరాలు. నర్సీపట్నం అయ్యన్న కాలనీకి చెందిన గొల్లవిల్లి కేశవ తన కుటుంబ సభ్యులతో కలిసి రెండేళ్ల క్రితం మునగపాకలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఏర్పరచుకున్నారు. ఈయన అనకాపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. చాలీచాలని జీతం కావడంతో కుటుంబ సభ్యుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో గురువారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం పిల్లలకు తినేందుకు ఏమైనా తీసుకొస్తానంటూ బయటకు వెళ్లిన కేశవ ఎంతకీ తిరిగిరాలేదు. కంగారుపడ్డ కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, తెలిసిన వారింట అన్వేషించారు. ఆచూకీ లభించకపోవడంతో భార్య ఇంద్రవల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి

- పరిహారం కోసం బాధిత కుటుంబం ఆందోళన
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపణ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంతోష్ అప్పారావు(ఫైల్)

మునగపాక: విద్యుత్ షాక్ కు గురై మునగపాక గ్రామానికి చెందిన రైతు దాడి సంతోష్ అప్పారావు(36) శుక్రవారం మృతి చెందాడు. తన తండ్రికి పొలం పనిలో సాయంగా వెళ్లిన సంతోష్ మరణంతో మునగపాకలో విషాదం అలముకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాకకు చెందిన సంతోష్ అప్పారావు వెల్డింగ్ పనులు చేసుకుంటూ, తమకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయాన్ని సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం పశువుల గెత్తాన్ని పంట భూమిలో వేసేందుకు తన తండ్రి శివతో పాటు పొలానికి వెళ్లాడు. పశువుల గెత్తం బస్తాను తండ్రికి అప్పగించి, విశ్రాంతి తీసుకుంటుండగా పక్కనే ఉన్న విద్యుత్ స్టే వైర్ తగిలింది. దీంతో షాక్‌కు గురైన సంతోష్ అక్కడికక్కడే కింద పడిపోయాడు. గమనించిన తండ్రి కేకలు వేయడంతో సమీపంలోని రైతులు చేరుకుని సంతోష్‌ను మునగపాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించే క్రమంలో మరణించాడు. విషయం తెలుసుకున్న మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద కారణాలను విద్యుత్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడు సంతోష్ అప్పారావుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కైన సంతోష్ అప్పారావు మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. బాధిత కుటుంబానికి మెరుగైన పరిహారం అందించాలని కోరుతూ గ్రామస్తులు విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే సంతోష్ మృతి చెందాడని, తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎస్ఐ ప్రసాదరావు జోక్యం చేసుకుని సంబంధిత అధికారులతో చర్చించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఏఎస్ఐ మన్మధరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌ను ఎంతో మెరుగుపరిచాం

- మరికొన్ని ఇతర ఆస్పత్రులకు రూ.18.23 కోట్ల వ్యయం
- బర్న్స్ వార్డుకు త్వరలో మరో రూ.2 కోట్లు
- ఎన్నికల్లో మీడియా సహకారం భేష్
- విశాఖ కలెక్టర్ మల్లికార్జున



మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయని కేజీహెచ్‌ను ఎంతో మెరుగుపరిచామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. దీంతో పాటు విక్టోరియా, చెస్ట్, ఆర్సీడీ, ప్రాంతీయ కంటి ఆస్పత్రులను మరింతగా అభివృద్ధి చేయడానికి రూ.18.23 కోట్ల సీఎస్సార్ నిధులు వెచ్చించామన్నారు. త్వరలో కేజీహెచ్ బర్న్స్ వార్డుకు మరో రూ.2 కోట్లు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. జిల్లాలో రూ.10.82 కోట్లతో ప్రభుత్వ వసతి గృహాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. ఇంకా జిల్లాకు ఆదాయం సమకూరే చర్యల్లో భాగంగా నాలుగు పెట్రోలియం ఔట్‌లెట్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. సార్వత్రిక ఎన్నికల ముగిసిన నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ రవిశంకర్‌తో కలిసి మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో యంత్రాంగానికి జర్నలిస్టులు ఎంతో సహకరించారని కొనియాడారు. మీడియా కథనాలతో యంత్రాంగం పొరపాట్లను సరిచేసుకునే వీలు కలిగిందని, ఇందుకు జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

నాణ్యంగా.. నిరంతరాయంగా..

చురుగ్గా ప్రీ మాన్‌సూన్ విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు



పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న కూలీలు



గాంధీనగరంలో విద్యుత్ లైన్ల వద్ద తొలగించిన చెట్ల కొమ్మలు

యలమంచిలి రూరల్: వేసవిలో ఇంట్లో ఉండాలంటే ఖచ్చితంగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీ ఉండాల్సిందే. ఇళ్లలో వాటర్ ట్యాంకులోకి నీరు లిఫ్ట్ చేయాలన్నా, రిఫ్రిజిరేటర్, మిక్సీ, వాషింగ్ మిషన్ పని చేయాలన్నా అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఎంతో అవసరం. దీనికితోడు ప్రస్తుతం మండుతున్న ఎండలతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయడానికి అధికారులు నిర్వహణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఫీడర్, విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. విద్యుత్ లైన్లపై వాలిన చెట్ల కొమ్మలు, వాటి మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించిన ఏపీఈపీడీసీఎల్ అధికారులు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ లైన్ల నిర్వహణ పనులను చేయిస్తున్నారు. చెట్ల కొమ్మలు తొలగించేందుకు ప్రత్యేకంగా కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. యలమంచిలి, కశింకోట, అనకాపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి రోజూ విద్యుత్ లైన్ల నిర్వహణ పనులను అధికారులు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒక రోజు ముందుగానే విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల సమాచారాన్ని ఆయా ప్రాంతాల్లో ప్రజలకు తెలియజేస్తూ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే వేళలను మీడియా ద్వారా తెలియజేస్తున్నారు. శుక్రవారం యలమంచిలి పట్టణంలో కొత్తపేట, మిలట్రీ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీనగరం, కోర్టుపేట, నాగేంద్ర కాలనీ, మధురానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మల్ని తొలగించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ దొర, లైన్‌మన్ ఆదినారాయణ పనులను పర్యవేక్షించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ నిరంతరాయంగా అందించేందుకు కృషి చేస్తున్నామని అనకాపల్లి డివిజన్ ఈపీడీసీఎల్(ఆపరేషన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు.

భార్య హంతకుడికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్: భార్యను అతికిరాతకంగా హత్య చేసిన నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని మహిళా కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంథి శ్రీనివాస్ తెలిపిన వివరాలివీ.. నిందితుడు నీలాపు పోలారాజు మహా నగర పాలకసంస్థలో పీహెచ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మృతురాలు రత్నం (30) 2015కి ముందు గాంధీ అని వ్యక్తిని వివాహం చేసుకున్నారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు కుటుంబ కలహాల కారణంగా విడిపోయారు. అనంతరం రత్నం పోలరాజును వివాహం చేసుకుంది. వీరు కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జ్ఞానాపురం కొండమీద కాపురం ఉండేవారు. కొంతకాలం సవ్యంగా సాగిన వీరి కాపురంలో అలజడి మొదలైంది. భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. 2015 మే 17న భార్యాభర్తలిద్దరూ గొడవ పడగా.. ఉదయం 8.30 గంటల సమయంలో నిందితుడు పోలరాజు రత్నంపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. శరీరం మెత్తం మంటలు వ్యాపించడంతో కాలిన శరీరంతో ఆమె కొట్టుమిట్టాడుతోంది. ఆ సమయంలో సమీపంలోని రమణ అనే వ్యక్తి పరిస్థితి చూసి రత్నంను కేజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె కన్ను మూసింది. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

కంటైనర్ ఢీకొని కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

మల్కాపురం: ద్విచక్ర వాహనంపై వస్తున్న ఒకరిని కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. గాజువాక సమీపంలోని వడ్లపూడి క్రాంతికాలనీకి చెందిన వెలగ నందికుమార్(42) ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన ఇంటి నుంచి షీలానగర్ మీదుగా మారుతి సర్కిల్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. కంటైనర్ బైక్‌ను ఢీకొంది. నందికుమార్ శరీరం నుజ్జు నుజ్జు అయ్యింది. పోలీసులు సమాచారం తెలుసుకుని.. అక్కడకు వెళ్లి ప్రమాదంపై వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ అప్పలనాయుడుని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

క్లుప్తంగా

విగ్రహాల ముసుగుల తొలగింపు



మెయిన్‌రోడ్డు పెరుగుబజార్ జంక్షన్ వద్ద దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగిస్తున్న జీవీఎంసీ ఉద్యోగులు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసిన సందర్భంగా పట్టణ పరిధిలోని దేశ నేతలు, రాజకీయ నాయకుల విగ్రహాలు, శిలాఫలకాలపై ముసుగులు తొలగించే పనుల్లో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నిమగ్నమయ్యారు. శుక్రవారం పట్టణంలోని పలు విగ్రహాల ముసుగులు తొలగించారు. ఈ ఏడాది మార్చి 16న దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిబంధనల మేరకు రాజకీయనాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన విషయం తెలిసిందే. కోడ్ ముగియడంతో విగ్రహాల ముసుగులను తొలగిస్తున్నట్లు అధికారులు చెప్పున్నారు.

నేడు అన్నసమారాధన

కశింకోట: స్థానిక రిక్షా స్టాండ్ వద్ద కొలువైన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు హనుమాన్ రిక్షా కార్మిక సంఘం ప్రతినిధులు కొల్లి రామంజి, ఇంటి ఈశ్వరరావు, కొల్లి సూరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమజ్జయంతి అనంతరం ఏటా అన్నసమారాధన చేస్తామన్నారు. ప్రజల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాల్సిందిగా కోరారు.

మలేరియా అవగాహన ర్యాలీ



నర్సింగబిల్లిలో మలేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కశింకోట: మండలంలోని నర్సింగబిల్లిలో శుక్రవారం వైద్య సిబ్బంది మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధుల బారిన పడకుండా ప్రజల్ని చైతన్య పరిచారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ మాట్లాడుతూ దోమల వల్లే మలేరియా సోకుతుందన్నారు. దోమల కుట్టకుండా జాగ్రత్త వహించాలని కోరారు. దోమతెరలు వాడాలన్నారు. వారానికి ఓసారి నిల్వ నీటిని పారబోసి, డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రసాద్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 199 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,150	5,150
రెండో రకం	3,050	4,250
మూడోరకం	3,500	3,940

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
గం గం గణేశా	:సత్యనారాయణ స్క్రీన్-2
బ్యాడ్ బాయ్స్(రైడ్ ఆర్ డై)	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్తిసాయి
సత్యభామ	:వెంకటేశ్వర
వెపన్	:శ్రీసత్య
భజే వాయు వేగం	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 329 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

జోరుగా ఉపాధి పనులు

ఉపాధి పనులు జోరందుకున్నాయి. కశింకోట మండలంలో ఈసారి రూ.10 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు అధికారులు లక్ష్య నిర్దేశం చేసుకున్నారు. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని, పనులు నిర్వహిస్తున్నారు. చెరువులు, కాలువల్లో పూడిక తొలగింపులతో పాటు, చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతుల పండ్ల తోటలకు రింగ్‌ట్రెంచ్ పనుల్ని చేపడుతున్నారు.

- రూ.10 కోట్ల విలువైన పనులు లక్ష్యం
- సాగునీటి వనరుల పునరుద్ధరణకు ప్రాధాన్యం
- ఉపాధి పనుల్లో పండ్ల తోటలకు రింగ్ ట్రెంచ్‌ల తవ్వకాలు



అడ్డాంలో రైతు భూమిలో జీడిమామిడి మొక్కలకు రింగ్ ట్రెంచ్‌లు తవ్వుతున్న ఉపాధి కూలీలు



జెట్టపురెడ్డితునిలో తవ్విన వ్యవసాయ చెరువు



విసన్నపేటలో కొబ్బరిచెట్లకు తవ్వుతున్న రింగ్ ట్రెంచ్

కశింకోట: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు మాసాలుగా ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా సాగునీటికి ఉపయోగపడే పనులు చేపడుతున్నారు. ఇప్పటికే నిర్ణీత బడ్జెట్ మేరకు సగం వరకు పనులు జరిగాయి. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పూడిక తొలగింపులకు ప్రాధాన్యం

మండలంలో 27 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఉపాధి పనులు చేపట్టారు. దీనిలో భాగంగా సాగు నీటి చెరువుల్లో పూడిక తీతలు, కందకాల తవ్వకాలు, మట్టి రోడ్ల నిర్మాణం, వ్యవసాయ చెరువుల తవ్వకం, గెడ్డలు, నదుల నుంచి పూడిక తీయగా వచ్చిన మట్టితో రక్షణ గట్లను పటిష్టం చేయడం తదితర పనులు చేస్తున్నారు. పంట భూములకు సాగునీటి సరఫరా మెరుగుపడేలా పంట కాలువలను పునరుద్ధరిస్తున్నారు. పిచ్చిమొక్కలు, పూడిక తొలగించి, గట్లను పటిష్టం చేస్తున్నారు.

నీరు నిలిచేలా రింగ్‌ట్రెంచ్

ఈసారి రైతులు తమ భూముల్లో పెంచుకునే జీడిమామిడి, మామిడి, కొబ్బరి తదితర మొక్కలకు చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండేలా పాడి(రింగ్ ట్రెంచ్) తవ్వకాలపై అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే సుమారు 30 ఎకరాల భూముల్లో వీటిని తవ్వారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు పెంచుకునే పండ్ల జాతి మొక్కలకు రింగ్ ట్రెంచ్‌లు ఉచితంగా తవ్వుతున్నారు. దీనివల్ల మొక్క మొదలు ప్రాంతంలో నీరు నిల్వ ఉండి పంట దిగుబడి పెరిగేందుకు దోహదపడుతుంది. అచ్చెర్ల, అడ్డాం, విసన్నపేట తదితర గ్రామాల్లో రింగు ట్రెంచ్‌ల తవ్వకాల పనులు జోరుగా సాగుతున్నాయి.

ఖరీఫ్ సాగునీటికి ధీమా

కశింకోట, వెదురుపర్తి ప్రాంతాల్లో కాశీమదుం, ఉమ్మలాడ ఆనకట్టల ద్వారా పంట పొలాలకు నీరు వచ్చేలా సాగునీటి పంట కాలువలను తవ్వారు. ఉపాధి పనుల్లో భాగంగా గడ్డి, తుప్పలు, చెత్త తొలగించి శుభ్రం చేశారు. దీంతో ఖరీఫ్‌లో పంట భూములకు అవసరమైన సాగునీరు పుష్కలంగా అందగలదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనుల నిర్వహణ వల్ల ఉపాధి కూలీలకు సమృద్ధిగా పని లభిస్తోంది. ఎండ దెబ్బ తినకుండా తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు పనులు నిర్వహిస్తున్నారు.

రూ.10 కోట్ల ఉపాధి పనులు

మండలంలో ఈ ఏడాది రూ.పది కోట్ల మేర ఉపాధి పనులు చేపట్టేందుకు లక్ష్య నిర్దేశం చేసుకున్నాం. ఆ మేరకు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని పంచాయతీల పరిధిలో పనులు నిర్వహిస్తున్నాం. రోజుకి సుమారు 5 వేల మంది పని చేస్తున్నారు. మే 25 వరకు చెల్లింపులు జరిగాయి. రూ.280 వరకు కూలి పనిని అనుసరించి చెల్లిస్తున్నాం. వారానికి రూ.87 లక్షల వరకు చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ ఏడాది చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు పెంచుకునే పండ్ల తోటల్లో మొక్కలు, చెట్లకు రింగ్ ట్రెంచ్‌ల తవ్వకాన్ని చేపడుతున్నాం.

– శివ, ఏపీవో, ఉపాధి హామీ పథకం, కశింకోట

విజ్ఞానం.. వినోదం.. వేసవి శిక్షణ

వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానంతోపాటు, వినోదాన్ని అందించేందుకు గ్రంథాలయాలు, ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణలో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. వేసవి సెలవుల తర్వాత కూడా గ్రంథాలయాలను ఉపయోగించుకుని విద్యార్థులు జ్ఞానసముపార్జన చేయాలని వక్తలు అభిలషించారు.



తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విజేతలతో గ్రంథాలయ సిబ్బంది, అతిథులు



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

- ఘనంగా ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు
- ఆట పాటలు, ఆసక్తికర అంశాల్లో రాణింపు

కశింకోట: విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను ఉపయోగించుకుంటే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని నరసింగబిల్లి పాఠశాల హెచ్‌ఎం బి.సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు విద్యతోపాటు పుస్తక పఠనం పట్ల దృష్టి సారించాలన్నారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి జి.మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. గ్రంథాలయంలో ప్రతి విద్యార్థి సభ్యులుగా చేరి పుస్తక పఠనంతో విజ్ఞానవంతులు కావాలని అభిలషించారు. వేసవి శిబిరంలో నిర్వహించిన చిత్ర లేఖనం, వ్యాస రచన, ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి సీహెచ్.కరుణశ్రీ, అచ్చెర్ల కార్యదర్శి ఎం.మహేష్, ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం, స్థానిక నాయకులు సీహెచ్ భాస్కరరావు, యు.రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. గత నెల 15 నుంచి ఇప్పటి వరకు గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్ర లేఖనం, పద్య పఠనం, అన్నమాచార్య కీర్తనలు, ఆటలు, పాటలు తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి డి.వరలక్ష్మి, కోదండ రామాలయం మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు, ఉపాధ్యాయుడు మళ్ల కోటేశ్వరరావు, రిటైర్డు టీచర్ యల్లపు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనే ఎన్డీఏ విజయానికి కారణం'



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న కర్రి రామకృష్ణ

అనకాపల్లి: ఎన్డీఏ కూటమిలో వరుసగా మూడోసారి భారత ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయనుండటం ఆనందంగా ఉందని బీజేపీ ఓబీసీ కార్యదర్శి కర్రి రామకృష్ణ అన్నారు. స్థానిక ఉడ్‌పేటలోని పార్టీ కార్యాలయం నుంచి రామచంద్ర థియేటర్ వరకూ శుక్రవారం ర్యాలీ నిర్వహించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సుపరిపాలన అందించడం వల్లే ప్రజలు మరోసారి బీజేపీకి పట్టం కట్టారన్నారు. కరోనా వంటి విపత్తుల సమయంలో ప్రపంచ దేశాలు అతలాకుతలం అయినా, మన దేశంలో కరోనా మరణాల తక్కువగా నమోదవడానికి మోదీ చర్యలు కారణమన్నారు. రానున్న ఐదేళ్ల పాలనలో దేశంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు బీజేపీ కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఉడా రమేష్, పొలమరశెట్టి నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్, నాయకులు మారిశెట్టి భాస్కరరావు, తాతారావు, కొండలరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లల నమోదు



దివ్యాంగ పిల్లలను గుర్తించి భవిత కేంద్రాలకు నమోదు చేస్తున్న ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు

తుమ్మపాల: దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం సమగ్ర శిక్ష పాఠశాల, భవిత కేంద్రాల ద్వారా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు చిట్టిబాబు, కోటేశ్వరరావు తెలిపారు. మండలంలో దివ్యాంగులైన కె.గోవర్ధన్, షణ్ముఖప్రియ ఇళ్లకు వెళ్లి, వారిని భవిత కేంద్రంలో నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల(దివ్యాంగ) పిల్లల్ని సంబంధిత పాఠశాల, భవిత కేంద్రాలలో చేర్పించడం ద్వారా పిల్లల అభివృద్ధికి బాటలు వేసినవారవుతారని పేర్కొన్నారు. పాఠశాల, భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ బాలలకు ప్రతి నెలా ఆర్థిక సాయం, ఉచిత వైద్య శిబిరం ద్వారా వారికి అవసరమైన వీల్‌చైర్, ట్రైసైకిల్, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్స్ అందిస్తామన్నారు. పిల్లలకు సదరం, బస్‌పాస్, ట్రెన్ పాస్ తదితర సౌకర్యాలపై తల్లిదండ్రులకు ప్రతి నెల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తామన్నారు. 9, 10 తరగతుల పిల్లలకు జాతీయ ఉపకార వేతనం ద్వారా ఏడాదికి రూ.9 వేలు నుంచి రూ.11 వేలు అందుతాయన్నారు. మండలంలో కొత్తగా 37 మంది దివ్యాంగ పిల్లల్ని గుర్తించామన్నారు. మరింత సమాచారం కోసం భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎస్.ఏసురత్నం(92906 21485), సీహెచ్ రమాదేవి(77023 53781)లను సంప్రదించవచ్చన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలని ఆందోళన



పెదపాడు సచివాలయం ముందు ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

అచ్యుతాపురం: మండలంలోని పెదపాడులో వారం రోజులుగా నిలిపివేసిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులు ఆందోళన చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టకపోవడంతో స్థానిక దళితులు, కౌలు రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పనులు ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్‌చేశారు. ఉపాధి కూలీలకు నెలకు వంద రోజుల పనిదినాలకు కచ్చితంగా కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ కోసం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ శుక్రువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, గొర్లివానిపాలెం, పవర్ సిటీ ప్రాంతాలకు సరఫరా ఉండబోదన్నారు.

10 నుంచి ఇంటింటికీ ధర్మ ప్రచారం



సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుల సమావేశం



కొండకర్ల రామాలయంలో సమావేశమైన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

పాయకరావుపేట: ఈ నెల 10 నుంచి 25 వ తేదీ వరకు ఇంటింటికీ ధర్మప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ ఖండ సంయోజకులు నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. ఎస్.నర్సాపురంలోని కృష్ణ మందిరంలో శుక్రవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ తాడి సూరిమూర్తి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత న్నారు. గ్రామంలో ఉన్న ఆలయాల్లో ప్రతి వారం భజన, హారతి కార్యక్రమాలు జరిపించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల ఉప కన్వీనర్లు పల్లేల జోగారావు, మేడిశెట్టి దివాణం, కట్టా వీరబాబు, నడిగట్ల శ్రీనివాసరావు, మంచాల రవి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఈ నెల 11 నుంచి 15 వరకూ ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి. రమణ తెలిపారు. మండలంలోని కొండకర్ల రామాలయంలో శుక్రవారం నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి గ్రామంలోనూ దేవాలయం కేంద్రంగా భజనలు,నగర సంకీర్తన,పౌర్ణమి సామూహిక హారతి నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు,గుడివాడ రమణ, ఆడారి త్రినాథ్,చోడపల్లి సత్యం,కట్టమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



కుల బహిష్కరణకు గురి చేశారంటూ వాపోతున్న బాధితులు దేముడు,చినతల్లి

మునగపాక: అన్నదమ్ముల మధ్య వివాదం కారణంగా శెట్టిబలిజ పెద్దలు తమను కుల బహిష్కరణ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ విషయమై ఎస్పీ,డీజీపీలకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని టి.సిరసపల్లి శివారు రామారాయుడుపేటకు చెందిన కుందిరి దేముడు, చినతల్లి దంపతులు మేకలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దేముడు కుటుంబానికి సంబంధించి అన్నదమ్ముల మధ్య 15 ఏళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దేముడు కుమారుడు పరదేశినాయుడును అడ్డం పెట్టుకుని వివాదాలు జరిగేవి. విషయం తెలుసుకున్న శెట్టిబలిజ కుల పెద్దలు రాము, రాజులు దేముడు కుటుంబ సభ్యులు ఉంటున్న ఇంటికి మూడు రోజుల క్రితం తాళం వేసి కుల బహిష్కరణ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మునగపాక పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి దేముడి ఇంటి తాళం తీసి వారికి రక్షణగా నిలిచారు. తరువాత రోజున మళ్లీ కుల పెద్దలు అదే ఇంటికి తాళం వేసి తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని అనకాపల్లి ఎస్పీ, డీజీపీల దృష్టికి తీసుకువెళతామని వారు తెలిపారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



వాసవీ కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న భక్తులు



ఆలయానికి వంటపాత్రలు, గ్యాస్ స్టౌ అందజేస్తున్న వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ నరసింహరావు

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. కింతలి–గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది గ్రామాలకు చెందిన వాసవీ క్లబ్ మహిళలు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చిన్నారులకు, మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాసవీ జిల్లా గవర్నర్ వై. నరసింహారావు, ఉప గవర్నర్ మధు, వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. క్లబ్‌కు వంటపాత్రలు, గ్యాస్ స్టౌను గవర్నర్ నరసింహారావు అందజేశారు. స్థానికులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు. కింతలి–గాదిరాయి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, కోశాధికారి పుట్టా కొండలరావు, వైస్ ప్రెసిడెంట్ కొట్యాడ గున్నయ్యశెట్టి, జిల్లా కోశాధికారి అనపగడ్డ హరిబాబు, రావాల సతీష్, పుట్టా మురళీకృష్ణ, తవ్వా సన్యాసిశెట్టి, వాసవీ క్లబ్ సభ్యులు, వాసవీ వనిత సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

- డీఎస్పీ సత్యనారాయణ



ఫార్మాసిటీలో మొక్కలు నాటుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జేఎన్ ఫార్మాసిటీలో రాంకీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మనం పర్యావరణాన్ని రక్షిస్తే అది మనలను రక్షిస్తుందన్నారు. మనం నాటే మొక్కలు భావితరాలకు నీడ, పండ్లు అందిస్తాయన్నారు. అవసరం ఉన్నా లేకపోయినా సహజ వనరులను నాశనం చేసి వినాశనాన్ని కొని తెచ్చుకోవద్దన్నారు.

ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటడానికి ముందుకు రావాలని డీఎస్పీ సత్యనారాయణ కోరారు. ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌రావు భక్షి మాట్లాడుతూ సహజ వనరులను కాపాడుకోవడం ద్వారా భావితరాల వారికి స్వచ్ఛమైన గాలి, నీరు, భూమిని అందిచ్చవచ్చునన్నారు. ఈ ఏడాది 25 వేల వివిధ రకాల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బాలికల సాధికారతకు ఎన్టీపీసీ పెద్దపీట



సాధికారత బాలికలతో ఆర్‌ఐఎన్‌ఎల్ డైరెక్టర్ పాండే, ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ఎన్టీపీసీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆర్‌ఐఎన్‌ఎల్ డైరెక్టర్ పాండే అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలిక సాధికారిత మిషన్-2024 ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగాపాల్గొని ప్రసంగించారు. పాండే వివిధ అంశాలపై చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. బాలికల్లో స్ఫూర్తి నింపింది. సంస్థ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె.సిన్హా మాట్లాడుతూ బాలిక సాధికారిత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాపరమైన ప్రేరణ, వ్యక్తిత్వ వికాసం, సాధికారితను పెంపొందించడానికి రూపొందించిన వివిధ కార్యకలాపాలతో వర్క్‌షాపు నిర్వహించినట్టు చెప్పారు.

మే 10న ప్రారంభమైన బాలిక సాధికారిత వర్క్‌షాపులో సమీప గ్రామాల నుంచి 120 మంది బాలికలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఆర్‌ఐఎన్‌ఎల్ డైరెక్టర్ పాండే, సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా చేతుల మీదుగా బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రేమ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.బీఏ హిస్టరీ,బీఎస్సీ జువాలజీ కోర్సులకు కళాశాల విద్య కమిషనర్ నుంచి అనుమతి వచ్చిందన్నారు.ఇప్పటివరకు ఉన్న ఐదు కోర్సులకు ఇవి అదనమన్నారు.డిగ్రీ ప్రవేశాల కోసం ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమతుందని,విద్యార్థులకు అడ్మిషన్లకు సంబంధించిన సమాచారం ఇవ్వడానికి కళాశాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.